# ముఖ్యమంత్రి కార్యాలయము

## తెలంగాణ ప్రభుత్వం

పత్రికా ప్రకటన-1 17, డిసెంబరు, 2014

మంజీరా నీటిని మెదక్ జిల్లా సాగునీటి అవసరాల కోసం పూర్తి స్థాయిలో వినియోగించుకొనే విధంగా తమ ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసిందని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు అన్నారు. మంజీరా నీరు హైదరాబాద్ ప్రజల మంచినీటి అవసరాల కోసం వినియోగిస్తున్నందువల్ల ప్రస్తుతం మెదక్ జిల్లాకు సాగునీటి కొరత ఏర్పడుతున్నదన్నారు. కృష్ణా నది నీటిని హైదరాబాద్ తరలించి మంజీరా నీటిని మెదక్ జిల్లాలో వినియోగించాలన్నది తమ లక్ష్యమని సిఎం ప్రకటించారు. మంజీరా నీటిని సింగూర్ ప్రాజెక్టులో నిలువ చేసి ఘనపూర్ ఆనికట్ ద్వారా మెదక్ జిల్లాలో 25 వేల ఎకరాలకు నీరందించే విధంగా పనులు చేయాలని ముఖ్యమంత్రి అన్నారు. మెదక్ జిల్లా పుల్కారం మండలంలో మంజీరా నదిపై నిర్మించిన ఘనపూర్ ఆనికట్‌ను ముఖ్యమంత్రి సందర్శించారు. నీటి పారుదల శాఖ మంత్రి టి.హరీష్‌రావు, డిప్యూటి స్పీకర్ పద్మాదేవేందర్ రెడ్డి, నీటి పారుదల శాఖ అధికారులతో కలిసి ఘనపూర్ ఆనికట్ పైన, మంజీరా నది పొడవునా ముఖ్యమంత్రి ఏరియల్ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఘనపూర్ ఆనికట్‌పై సమీక్ష చేశారు. మంజీరా నది ద్వారా 4.06 టి.ఎం.సి. ల నీటి కేటాయింపు ఘనపూర్ ఆనికట్‌కు ఉందన్నారు. దీని ద్వారా ధర్మంగా 25 వేల ఎకరాలకు సాగునీరు అందాలని, కాని ప్రస్తుతం 12 వేల ఎకరాలకు మాత్రమే నీరందుతున్నదని ముఖ్యమంత్రి అన్నారు. ఎట్టి పరిస్థితుల్లో 25 వేల ఎకరాలకు నీరందించాలని, వీలయితే మరో 5 వేల ఎకరాలకు ఎక్కువగానే నీరివ్వాలని ముఖ్యమంత్రి చెప్పారు. ఆనికట్ కాలువల్లో బాగా పూడిక పేరుకుపోయిందని, దాన్ని తొలగించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. కాలవలన్ని మట్టితోనే ఉన్నందున అవి పూడుకుపోయాయని, కాలువలకు లైనింగ్ వేయడం ద్వారా చివరి ఆయకట్టు వరకు నీటిని పంపాలని చెప్పారు. ఆనికట్‌లో పూర్తి స్థాయి నీటి మట్టం ఉంటే పరిసర ప్రాంతాల్లోని పంట పొలాలు మునిగే అవకాశం

ఉందని, ఈ ప్రమాదాన్ని నివారించడానికి కరకట్టలు నిర్మించాలని సిఎం ఆదేశించారు. పూర్తి స్థాయి నీటి నిలువ సామర్థ్యాన్ని కాపాడటానికి తీసుకోవలసిన చర్యలపై అధ్యయనం జరిపి నివేదిక సమర్పించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఘనపూర్ ఆనికట్ పరిధిలో తాను గతంలో పాద యాత్రలు చేశానని, మంజీరా నదిలో ఇక్కడే పుష్కర స్నానం చేశానని సిఎం గుర్తు చేసుకున్నారు. సమైక్య పాలనలో ఘనపూర్ ఆనికట్ నిర్వహణను విస్మరించారని,కాలువలకు లైనింగ్ వేయకపోవడం వల్ల అవి శిథిలమై పోయాయని ముఖ్యమంత్రి అన్నారు. ఇప్పుడు ఈ ఆనికట్‌పై పూర్తి స్థాయిలో దృష్టి కేంద్రీకరించాలని నిర్ణయించామన్నారు. 1905లో నిర్మించిన ఈ ఆనికట్ ద్వారా కొత్తగా పంట పొలాలను ముంచకుండానే ఎక్కువ నీటిని నిలువ చేసుకునే మార్గాలు అన్వేషించాలన్నారు. ఒకటిన్నర నుండి రెండు టి.ఎం.సి.ల నీరు నిలువ ఉండేలా చర్యలు తీసుకోవాలని, నీరు పంట పొలాలకు తరలిస్తున్న కొద్ది ఏర్పడే ఖాళిని సింగూర్ ప్రాజెక్టు ద్వారా భర్తీ చేసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు.

ఈ కార్యక్రమాల్లో ఇంకా విద్యా శాఖ మంత్రి జగదీష్ రెడ్డి, ఎంపి కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్సీలు సుధాకర్ రెడ్డి, భూపాల్‌రెడ్డి, ఎమ్మెల్యేలు మదన్‌మోహన్‌రెడ్డి, చింతప్రభాకర్, మహిపాల్‌రెడ్డి, జడ్పి ఛైర్‌పర్సన్ రాజమణి,నీటిపారుదల శాఖ కార్యదర్శి ఎస్‌కె.జోషి, ఈ.ఎన్.సి.మురళిధర్, కలెక్టర్ రాహుల్ బొజ్జా, స్మితా సబర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

---

సిపిఆర్ఓ టు సిఎం